# ఫార్మాల్టీస్

కర్లపూడి విజయలక్ష్మి

తలుపు చప్పుడయితే చేస్తున్న పనాపి.. తడిచేతులు కొంగుకి తుడుచుకుంటూ వెళ్ళి తలుపుతీశాను. ఎదురుగా...

డ్రస్‌లో వున్న పోలీస్.. అంతే ఒక్కడుగు వెనక్కి వేశాను. భయంతో చెమట్లు పట్టాయి. వెయ్యి అనుమానాలు.. లక్ష ఆలోచనలు ఒక్కసారిగా చుట్టుముట్టాయి.

''నారాయణగారిల్లిదేనా?''

తడారిపోతున్న గొంతుతో... నాకే వినబడనంత నెమ్మదిగా చెప్పాను.

''అవును.''

మావారి పేరు ఎందుకడిగాడు? నేను అవును అని చెప్పటంవల్ల ఏదైనా పొరపాటు జరుగుతుందా? లేక మావారివల్ల ఏదైనా పొరబాటు జరిగిందా? కానీ అలా జరగటానికి నూటికి నూరుపాళ్ళూ అవకాశం లేదు. ఎందుకంటే నీతీ.. నిజాయితీలకి మావారు మారుపేరు. కానీ పోలీస్ రాకకి కారణం మాత్రం కనిపించలేదు.

''ప్రకాష్ మీ అబ్బాయేనా?''

''ఉలిక్కిపడ్డాను.'' కరుకుగా ఆయన అడిగాడో.. భయంవల్ల నా చెవులకే అలా విన్పించిందో తెలీదు.

మా పెద్దాడి పేరడుగుతాడేంటి? మావాడేమి అల్లరి చిల్లర పనులుచేస్తూ.. ఆకతాయిగా తిరిగేవాడేమీ కాదు. నేను హెచ్చులు చెబుతున్నాననుకోపోతే ఒక్క మాట, మా పిల్లలు చాలా బుద్ధిమంతులు.. మంచి ముత్యాలు. ఆ .. ఎవరిపిల్లలు వారికి బంగారమే.. కాకిపిల్ల కాకికి ముద్దులాంటి వాక్యాలు మీకు గుర్తొస్తే ఖచ్చితంగా అది పొరబాడే. మావాళ్ళు నిజ్జంగా బుద్ధిమంతులే. మాది బుద్ధిమంతుల కుటుంబం అంటే మీరు నమ్మితీరాలి మరి.

అలాంటిది మావారి గురించి.. పెద్దాడి గురించి ఆరా తీసేసరికి... అదీ ఒక పోలీసు అడిగేసరికి నాలో భయంతో కూడిన సన్నని వణుకు బయలుదేరింది. ఆ పరిస్థితిలో మీరున్నా అలాగే వణుకుతారు. భయంవల్ల గుండెల్లో అదోమాదిరిగావుండి.. పైకే వినిపించేంత గట్టిగా టకటకా కొట్టుకుంటోంది. ఆ స్థితిలో వుండే, అవుననో.. కాదనో నాకే తెలీదు. తలని అడ్డంగానూ నిలువుగానూ ఊపేశాను.

''లోపలికి రావచ్చా?'' అడిగాడు.

మామూలుగా మా ఇంటికి ఎవరైనా వస్తే మర్యాదపూర్వకంగా ముందు గదిలోకి ఆహ్వానించి.. సోఫాలో కూర్చున్న తర్వాత.. మంచినీళ్ళు కావాలా అని అడిగి ఆపై వారి రాకకి కారణం తెలుసుకొనేదాన్ని. ఇదంతా మావారు నేర్పారు. నేను అట్టే చదువుకోలేదని వచ్చినవారితో అమర్యాదగా ప్రవర్తించి.. వచ్చిన వారి ముఖం మీదే తలుపులు వేసేస్తానేమోనని మావారి భయం.

''ర.. రండి.. మ.. మంచి.. నీళ్ళు త్రాగుతారా?'' వణుకుతున్న గొంతుతో అడిగాను.

''వద్దులేమ్మా?''

నే చూపించిన కుర్చీలో కూర్చుని.. జేబులోంచి కొన్ని కాగితాలు తీసి నాకు చూపిస్తూ...

''ఇతనేనా మీ అబ్బాయి?'' అడిగాడు.

ఒక్కసారిగా నా గుండె జారినట్టయ్యింది. మావాడి ఫోటో పోలీసువాళ్ళ దగ్గరకెలా వెళ్ళిందో? వాడు చేసిన నేరం ఏమిటో? అంతుపట్టలేదు. అంతా అయోమయంగా వుంది.

''మా అబ్బాయే... ఈ ఫోటో మీ దగ్గరకెలా వచ్చింది?'' అంత ధైర్యం ఎలా వచ్చిందో మాటలు కూడబలుక్కొని అడిగాను.

''ఆ సంగతి తర్వాత... ఏం చదువుతున్నాడు?''

భయం.. భయంగానే చెప్పాను.

''ఎక్కడ చదువుతున్నాడు?''

అదీ చెప్పాను.

''నారాయణగారు ఆఫీస్‌కెళ్ళారా?''

''అవును!'' తొందరగా వెళ్ళిపోతాడేమోనని గబుక్కున అన్నాను.

''అయితే మీరొక్కరే వున్నారా ఇంట్లో?''

వోరి వీడి దినం పెట్ట.. ఒక్కత్తివే వున్నావా? అని అడుగుతున్నాడేంటీ.. ఏదో కథవుంది. ఎందుకైనా మంచిది కాస్త తెలివిగా జవాబు చెప్పాలి. కాసేపు ఆలోచించుకొని.. పెరట్లో మా అత్తగారున్నారు.. పిలవమంటారా? మూడేళ్ళ క్రితమే స్వర్గస్తురాలైన మా అత్తగారి గురించి కాస్త మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ అబద్ధం చెప్పేశాను.

''వద్దులే.. మాకు ఏవో ఫార్మాల్టీసు వుంటాయి.'' నసిగాడు.

అమ్మ దొంగవెధవా.. నాకు అర్థంకాని ఇంగ్లీషు మాట్లాడి ఏదో నసుగుతున్నాడు. కొంపదీసి బూతు మాట కాదుగదా? అనుకుంటూ 'ఫార్మాల్టీసా?' అన్నాను ఆశ్చర్యంగా.

''అది మీకు తెలీదులే.'' నువ్వో పల్లెటూరి బుచ్చివి అన్నట్టు నావేపు ఓ చూపు విసిరి.. ''సాయంత్రం మీ వారిని.. మీ అబ్బాయిని ఈ అడ్రస్‌కి వచ్చి కలవమనండి'' వో కాయితం ముక్క నాచేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. లోపల మా అత్తగారున్నారని చెప్పేసరికి వెధవ అమాయకంగా ముఖంపెట్టి.. భయంతో తోక ముడిచాడు నవ్వుకున్నాను.

ఓరోజు టెలీఫోన్ వాళ్ళు వచ్చి- ''మీకు ఫోన్ వచ్చింది. ఎక్కడ పెట్టమంటారు?'' అని అడిగారు. దానికోసం ఏవో కాగితాలు పంపించి కూడా సంవత్సరం అవుతోంది. రెండు మూడు నెలలుగా ఇంట్లో అంతా దానికోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నాము. అట్లాంటిది ఈరోజు ఇంట్లో ఎవరూలేని సమయంలో వాళ్ళు వచ్చారు.

ఫోన్ ఎక్కడ పెట్టుకుంటే అనువుగా వుంటుందో మేమంతా ముందే నిర్ణయించుకున్నాము కనక చెప్పాను.

పెద్దనిచ్చెన కావాలని వాళ్ళడిగారు. నాలుగిళ్ళూ తిరిగి నిచ్చెన తీసుకొచ్చాను. ఎప్పుడూ స్తంభాలెక్కి పనులు చేసుకొనే వాళ్ళు నిచ్చెన తెచ్చుకోవాలని తెలీదు చేతులూపుకుంటూ రాకపోతే వెధవలు. మనసులోనే తిట్టుకున్నాను.

ఒక్క పావుగంటలో వైరులన్నీ చక్కగా పెట్టారు. ఫోన్ చూడగానే నాకు భలే ఆనందం కలిగింది. మెడ్రాస్‌లో ఉద్యోగం చేస్తున్న మా అమ్మాయితో ఎంచక్కా మాట్లాడుకోవచ్చున్నది నా ఆనందానికి ముఖ్యకారణం.

వచ్చిన ఫోన్ అబ్బాయిల్లో ఒకడు వెళ్ళిపోయాడు. ముగ్గురు మా ఇంట్లో ఎందుకుండిపోయారో నాకర్థం కాలేదు. వాళ్ళవేపు చిరాగ్గా చూస్తూ నిలబడిపోయాను. కాసేపటికి మా ఇంట్లో ఫోన్ గణగణ మ్రోగింది.

మొదటిసారిగా ఆ చప్పుడు అంత దగ్గరగా వినటం వల్లనేమో నా గుండె దడదడలాడింది. కానీ ఒక విషయం మాత్రం అర్థమైంది.

ఒకడు వెళ్ళింది ఫోన్ చేయటానికి.. ఇక్కడ వున్న

వాళ్ళు అది పనిచేస్తోందో లేదో తెలుసుకోటానికని. ఫోన్ నంబర్ కూడా చెప్పారు. దాన్ని ఒకటికి రెండు సార్లు మనసులోనే మననం చేసుకున్నాను.

అమ్మా! మీ ఫోన్ పనిచేస్తోంది.. రెండు మూడు రోజుల్లో ఎస్‌టిడీ సౌకర్యం కూడా కల్పిస్తాము. ఆ సంగతి మీకు ఫోన్‌చేసి చెబుతాము. 'మాకు ఫార్మాల్టీస్ వుంటాయమ్మ! సార్ ఇంట్లో లేరుగా'' అడిగారు.

ఫార్మాల్టీస్! ఇంతకు ముందు ఎక్కడో ఈ మాట విన్నాను. ఎక్కడ విన్నాను.. కాసేపు మెదడుకి పని చెప్పగానే గుర్తొచ్చింది. నెల క్రితం మా ఇంటికి వచ్చిన పోలీసాయన ఈ మాట అన్నాడు. అవునూ! అసలు ఆ పోలీసు మా ఇంటికి ఎందుకొచ్చాడో మావార్ని అడగటం మర్చేపోయాను. అయినా మాకేం అంతలా భయపడినవాన్ని ఆ సంగతే మర్చిపోవటం నాకు విచిత్రంగా అన్పించింది. ఈ ఫార్మాల్టీస్ గోలేంటో కూడా అర్థంకాలేదు. దానిసంగతి ఈరోజు తెలుసుకోవాలి అనుకొని-

''ఇంట్లో లేరు'' అన్నాను.

''సాయంత్రం ఏడింటికి వచ్చి సార్‌ని కలుస్తామని చెప్పండి'' వెళ్ళిపోయారు.

ఆయన ఆఫీస్‌నుండి ఇంటికి రాగానే ముందుగా ఫార్మాల్టీసు సంగతి అడగాలి అనుకొన్నాను.

ఇంటికి వచ్చిన మావారు ''ఫోన్ చూడగానే వికసించిన ముఖంతో ఎప్పుడు బిగించారు'' అడిగారు.

''ఉదయం పదకొండున్నర అవుతోంది. అన్నట్టు మర్చిపోయాను. వాళ్ళు వచ్చి సాయంత్రం మిమ్మల్ని కలుస్తామని చెప్పి వెళ్ళారు. ఏవో ఫార్మాల్టీస్ వున్నాయట.''

''అవునూ! ఫార్మాల్టీసు అంటే ఏవిటి? నెల క్రితం మనింటికి వచ్చిన పోలీసు కూడా ఈ మాటే అన్నాడు'' అడిగాను.

''ఫార్మాల్టీసంటే.. ఒకరకంగా చెప్పాలంటే లంచం'' షర్ట్ విప్పి హేంగర్‌కి తగిలిస్తూ అన్నారు.

''లంచమా'' ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేస్తూ అన్నాను.

''ఎందుకంత ఆశ్చర్యం.. దాన్నే మామూళ్ళు అని కూడా అంటారు. ఇంజనీరింగ్ చదువుతున్న మనపెద్దాడు... విదేశాలకెళ్ళటం కోసం మన గవర్నమెంట్ నుండి పర్మిషన్ అంటే అనుమతి తీసుకోవాలని పాస్‌పోర్ట్ కోసం అప్లై చేశాడు కదా! దానికి పోలీసు ఎంక్వైరీ చేశారు. అంటే వాళ్ళు వచ్చి మనగురించి.. మన ఫ్యామిలీ గురించి ఇరుగుపొరుగు వారిని విచారించి తెలుసుకొని.. మనం అప్లికేషన్‌లో వ్రాసినవన్నీ నిజాలేనని.. మన మీద ఎటువంటి పోలీసు కేసులు లేవని పాస్‌పోర్ట్ ఆఫీసుకి వ్రాసి పంపిస్తారు. కొన్నాళ్ళ తర్వాత మనకి పాస్‌పోర్ట్ పోస్ట్‌ద్వారా వస్తుంది.''

''దానికోసం ఆ కానిస్టేబుల్ పదిమంది ఇళ్ళకి వెళ్ళి విచారించకుండా సరాసరి మన దగ్గరకే వచ్చి వివరాలు తెలుసుకొని వ్రాసుకొన్నాడు. అందుని మిత్తం ఫార్మాల్టీస్ పేరుతో మూడు వందలు లంచం తీసుకున్నాడు. ఉద్యోగాల కోసం వెళ్ళేవాళ్ళకయితే ఐదువందలట. ఫిక్సడ్ రేట్లని వాళ్ళే చెబుతున్నారు!'' లుంగిలోకి మారుతూ అన్నారు.

''మనమ్మాయికి ఉద్యోగం వచ్చినపుడు జరిపిన పోలీస్ ఎంక్వయిరీకి కూడా ఐదువందలేట. కానీ ఆ వచ్చిన కానిస్టేబుల్ మన పెద్దాడి క్లోజ్‌ఫ్రెండ్ కిరణ్‌కి బాగా దగ్గరి బంధువులు. అందుకే మనింటికి రాలేదు. ఫార్మాల్టీస్ అడగలేదు'' చిన్నగా నవ్వుతూ అన్నారు.

''ఆ .. ఆ .. ఇపుడు నాకు బాగా అర్థమైంది. మనకి ఫోన్ బిగించిన వాళ్ళు కూడా లంచం.. తప్పు తప్పు ఫార్మాల్టీస్ కోసం ఇప్పుడు వస్తానన్నారు. లంచానికి వేసిన అందమైన ముసుగే ఫార్మాల్టీస్. భలే అందమైన మాట కనిపెట్టారు. ఎక్కడ చూసినా.. విన్నా ఫార్మాల్టీసు.. ఫార్మాల్టీసు'' కోపంగా అన్నాను.

''మరీ అంతలా కోపగించుకోకు భార్యామణీ.. నువ్వుమాత్రం నిజాయితీ పరురాలిననుకుంటున్నావా?'' నిలదీశారు.

అర్థంకాక తెల్లమొహం వేశాను.

''నీకు మాత్రం మల్లెపూల ఫార్మాల్టీసు లేవా ఏవిటి ప్రతిరోజు'' కొంటెగా నవ్వుతూ అన్నారు.

బోలెడు సిగ్గు ముంచుకురాగా ''అయ్యో! మాటల్లో పడి మీ కాఫీ సంగతే మర్చిపోయాను.'' మొహం చాటుచేసుకుంటూ వంటగదిలో దూరిపోయాను.

★

